

'ఆధార్' గోస..

ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం జిల్లాలోని పలు మీ సేవా కేంద్రాల వద్ద జనం తెల్లవారు జాము నుంచే బారులుదీరుతున్నారు. 8లో



కుర్చీలకు అతుక్కుపోయారు !

సింగరేణిలో కొందరు అధికారులు, ఉద్యోగులు బదిలీ కాకుండా పైరవీలు చేస్తూ ప్రధాన కార్యాలయంలోనే తిష్ట వేస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 19°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రత కాస్త ఎక్కువగానే ఉంటుంది. తెల్లవారుజామున, రాత్రి కొంతమేర చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. రామయ్య నిత్య కల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘటాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో అర్చన అనంతరం మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, సభ్యుడు గంధం వెంగళరావు పాల్గొన్నారు.

25న చండీహోమం

పెద్దమ్మతల్లి ఆలయంలో ఈనెల 25న చండీ హోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్ర నామాలు నమోదు చేసుకోవాలని కోరారు. మగవారు ధోవతి, కుండువా, మహిళలు చీరలు ధరించాలని సూచించారు. వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పర్ణశాల హుండీ ఆదాయం రూ.18.52లక్షలు



హుండీ లెక్కింపు అనంతరం ఈఓ, అధికారులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన దుమ్ముగూడెం మండలం పర్ణశాలలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఆలయ ఈఓ రమాదేవి సమక్షాన నగదు లెక్కించగా 276 రోజులకు గాను రూ.18,52,402 ఆదాయం నమోదైంది. అలాగే, వివిధ దేశాల కరెన్సీ కూడా లభించింది. కాగా, 2023 ఏప్రిల్ 17వ తేదీన చివరిసారి హుండీ లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవానీ రామకృష్ణ, నిరంజన్‌కుమార్, కత్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: పట్టణంలోని తెలంగాణ మైనార్టీ పాఠశాల, కళాశాలలో 2024 – 25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్ లాల్ హట్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ముస్లిం మైనార్టీ విద్యార్థులకు 28, మైనార్టీలకు 2, ఎస్సీలకు 2, ఎస్టీలకు 2, బీసీలకు 5, ఓసీలకు 1 సీటు ఉన్నాయని వివరించారు. 6 నుంచి 8 తరగతుల్లో మిగిలిన మైనార్టీ సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మైనార్టీ విద్యార్థులకు ముందుగా సీట్లు కేటాయిస్తామని, మైనార్టీయేతర విద్యార్థులకు లక్కీ డిప్ ద్వారా అడ్మిషన్లు ఇస్తామని వెల్లడించారు.

ఖరీఫ్ నాటికైనా కల నెరవేరేనా?

అందుబాటులోకి రాని సీతమ్మసాగర్ హెడ్ రెగ్యులేటరీ

- నత్తనడకన సాగుతున్న నిర్మాణం
- అసంపూర్తిగానే కాల్వల పనులు
- ఐదు నెలల్లో పూర్తయితేనే ఫలితం



అసంపూర్తి పనులతో దర్శనమిస్తున్న సీతమ్మ సాగర్ హెడ్ రెగ్యులేటరీ

పూర్తి స్థాయిలో కాకపోయినా కనీసం కృష్ణా ఆయకట్టుకైనా ఖరీఫ్ సీజన్ నాటికి గోదావరి నీటిని అందించాలనే తాపత్రయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఉన్నారు. ఈ మేరకు సీతారామప్రాజెక్టు పనులపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ప్రాజెక్టు పనులు ఎంతవరకు వచ్చాయి.. ఎదురువుతున్న ఇబ్బందులు ఏంటి అనే అంశంపై ఇంజనీర్లు, సహచర మంత్రులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. రాబోయే మే చివరి నాటికి మిగిలిన పనులు పూర్తి చేసేలా అధికారులను ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారు. అలాగే ఈ సాగునీటి ప్రాజెక్టులో కీలకమైన హెడ్ రెగ్యులేటరీ నిర్మాణ పనులపై కూడా మంత్రి ఫోకస్ పెట్టాల్సి ఉంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

సీతమ్మ సాగర్ బ్యారేజీకి అన్ని రకాల అనుమతులు లేవనే కారణంతో గ్రీన్ ట్రిబ్యునల్, కేంద్ర పర్యావరణ శాఖ నిర్మాణ పనులను ఆపేశాయి. అయితే కొత్తగా నిర్మిస్తున్న బ్యారేజీకి దిగువన బ్రిటీష్ కాలంలో నిర్మించిన పాత ఆనకట్ట ఇప్పటికీ పదిలంగా ఉంది. వానాకాంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు గోదావరిలో వరద ప్రవాహం ఎక్కువగానే ఉంటుంది. ఈ సమయంలో నాలుగు టీఎంసీల సామర్థ్యం గల ఈ ఆనకట్టను తాత్కాలిక అవసరాలకు వినియోగించుకుంటే పూర్తి స్థాయిలో కాకపోయినా ఎంపిక చేసిన ప్రాంతాలకు నీటిని అందించే అవకాశం ఉంటుంది. అయితే ఆనకట్ట నుంచి ప్రధాన కాలువలోకి నీటిని మళ్లించే హెడ్ రెగ్యులేటరీ వ్యవస్థ నేటికీ అందుబాటులోకి రాలేదు. దీంతో కనీసం తాత్కాలికంగా అయినా గోదావరి నీటిని ఉపయోగించుకునే వీలు లేకుండా పోతోంది.

నత్తనడకన హెడ్ రెగ్యులేటరీ పనులు

గోదావరి నుంచి నీటిని కాలువలోకి మళ్లించడంలో హెడ్ రెగ్యులేటరీ కీలకం. ప్రస్తుతం సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మిస్తున్న ప్రదేశానికి ఎగువన అశ్వాపురం మండల పరిధిలో గోదావరి తీరం వెంట హెడ్ రెగ్యులేటరీ పనులను గత జనవరిలో ప్రారంభించారు. ఫిబ్రవరి నుంచి పనుల్లో వేగం పెరిగినా ఆ తర్వాత పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది. దాదాపు ఏడాది గడిచినా ఇప్పటివరకు 50 శాతం మేర మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఇంకా 50 శాతం పనులతో పాటు నది నుంచి హెడ్ రెగ్యులేటరీ వరకు అప్రోచ్ కెనాల్ నిర్మాణ పనులు కూడా చేపట్టాల్సి ఉంది. ఇవన్నీ పూర్తయితేనే నది నుంచి నీటిని తీసుకునే అవకాశం కలుగుతుంది. కానీ హెడ్ రెగ్యులేటరీ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

వైరా వరకు నీరు..

గోదావరి నది నీటిని పంట పొలాల వరకు చేర్చే కాలువల నిర్మాణం కూడా పూర్తి కాలేదు. ప్రధాన కాలువలతో పాటు బ్రాంచ్ కెనాళ్లు పూర్తి స్థాయిలో నిర్మాణం అయితేనే ప్రాజెక్టు ఫలాలు సంపూర్ణంగా అందుతాయి. సీతారామ విషయంలో నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన బీజీ కొత్తూరు (అశ్వాపురం), వీకే రామవరం, కమలాపురం (ములకలపల్లి) పంప్ హౌస్‌ల నిర్మాణం తప్ప ఇతర పనులు అసంపూర్తిగానే మిగిలాయి. గోదావరి నుంచి నీరు ముందుగా బీజీ కొత్తూరు పంప్‌హౌస్‌కు చేరుకుంటుంది. అక్కడ ఎత్తిపోయడం ద్వారా వీకే రామవరం పంప్‌హౌస్‌కు నీరు వస్తుంది. ఇక్కడ ఒక కాలువ ద్వారా చండ్రుగొండ, జూలూరుపాడు, ఏన్కూరు మీదుగా వైరా రిజర్వాయర్ వరకు నీటిని తరలించే వీలుంటుంది.

మరో కాలువ ద్వారా..

వీకే రామవరం దగ్గరున్న పంపు హౌస్ నుంచి రెండో కాలువ ద్వారా ఎత్తిపోసిన నీరు కమలాపురం పంప్‌హౌస్‌కు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి వివిధ కాలువల ద్వారా అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాలకు వెళ్తుంది. అయితే గోదావరి తీరం నుంచి బీజీ కొత్తూరు మీదుగా వీకే రామవరం వరకే ప్రధాన కాలువ పనులు జరిగాయి. అక్కడి నుంచి కింది వరకు పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో పంప్ హౌస్‌లు అందుబాటులోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా వాటిని ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది. సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులు మొదలై ఏడేళ్లు దాటుతోంది. ఇప్పటి వరకు రూ.7,500 కోట్ల వరకు వ్యయం చేశారు. అయినప్పటికీ ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేని పరిస్థితి ఉంది. కనీసం హెడ్ రెగ్యులేటరీ, కాలువల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తే పాత ఆనకట్ట ద్వారా కొంతైనా నీటిని వాడుకునే వీలు కలుగుతుంది.

ఎల్‌డబ్ల్యూఈ పనులకు మోక్షం

- జిల్లాలో ఏడు రహదారులు, పది బ్రిడ్జిలకు అటవీ క్లియరెన్స్
- మంత్రి తుమ్మల చొరవతో అనుమతులు



దుమ్ముగూడెం మండలం గోవిందాపురం - బక్కచింతలపాడు రహదారి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో అటవీ శాఖ అనుమతులు లేక నిలిచిపోయిన రోడ్లు, బ్రిడ్జి నిర్మాణ పనులకు మోక్షం లభించింది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ చూపడంతో ఏడు రహదారులు, పది బ్రిడ్జిలకు అటవీశాఖ అనుమతులు వచ్చాయి. వామపక్ష ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎల్‌డబ్ల్యూఈ(లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిజం) కింద భద్రాద్రి జిల్లాలో 76 పనులకు రూ.341.26 కోట్లు మంజూరు చేసింది. 227 కి.మీ. నిడివితో 38 రోడ్లు, 38 బ్రిడ్జిల నిర్మాణం సాగుతోంది. అయితే వీటికి సంబంధించిన పనులు చాలాచోట్ల అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో నిలిచిపోయాయి.

మంత్రి జోక్యంతో..

నిలిచిపోయిన పనులపై మంత్రి తుమ్మల సీఎంఓలోని ఉన్నతాధికారులతో మాట్లాడారు. పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. దీంతో పలు రహదారులు, బ్రిడ్జిలకు అటవీ అనుమతులు లభించగా, ఈ పనులు త్వరగా పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. అంతేకాకుండా మరో 25 పనులకు అనుమతి రావాల్సి ఉండడంతో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌తో మాట్లాడాలని సీఎంఓ అధికారులకు సూచించారు. ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండాలంటే రహదారులు, బ్రిడ్జిల నిర్మాణం పూర్తికావాల్సి ఉందని తెలిపారు. గ్రామాల్లో విద్య, వైద్యం, మార్కెటింగ్, వ్యవసాయ రంగాల అభివృద్ధికి రహదారులు, బ్రిడ్జిలు ఉపయుక్తంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

అనుమతి వచ్చిన రహదారులివే..

జిల్లాలో మొత్తం ఏడు రహదారులు, పది బ్రిడ్జిల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు లభించాయి. వీటిలో చర్ల మండలంలోని ఆరు రహదారులు, దుమ్ముగూడెం మండలంలోని ఒక రహదారి ఉన్నాయి. అలాగే, చర్ల మండలంలో తొమ్మిది, దుమ్ముగూడెం మండలంలో ఒక బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి రావడంతో పనులు ఊపందుకోనున్నాయి.

28న సీఎంఓఏఐ ఎన్నికలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి (ఎస్సీసీఎల్ బ్రాంచ్)లో ఈనెల 28న కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ) ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా, ఈనెల 19 వరకు దాఖలుకు అవకాశం ఉంది. 22న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 23న అర్హుల జాబితాలను ఆయా ఏరియాల రిటర్నింగ్ అధికారులు ప్రకటిస్తారు. 28న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల పోలింగ్ కొనసాగుతుంది. అదే రోజు సాయంత్రం నుంచి 29వ తేదీ వరకు లెక్కింపు కొనసాగుతుంది. ఈనెల 30న ఫలితాలు వెలువరించడంతో పాటు గెలుపొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. సింగరేణి వ్యాప్తంగా ఈ ఎన్నికలు జరుగుతాయి. ఒక్కో ఏరియాలో ఏరియా స్థాయి కమిటీతో పాటు మొత్తం కేంద్ర కమిటీకి ఎన్నికలు జరుగుతాయి. ఏరియా జీఎంలు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. సంస్థ వ్యాప్తంగా మొత్తం 2,300 మంది అధికారులు ఓట్లు వేయనున్నారు. కాగా, ప్రెసిడెంట్ పదవికి కొత్తగూడెం ఏరియాలోని పీవీకే – 5 ఇంక్లైన్ మేనేజర్ పాలడుగు శ్రీనివాస్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు.

పామేడు ఘటనతో హైఅలర్ట్

- సరిహద్దుకు భారీగా తరలుతున్న పోలీసు బలగాలు
- అడుగడుగునా తనిఖీలు.. ఆదివాసీల ఆందోళన



చర్ల: పామేడు ఘటనతో ఏజెన్సీలో పోలీసు ఉన్నతాధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. అటు ఛత్తీస్‌గఢ్ ఇటు తెలంగాణా రాష్ట్ర పోలీసులు అప్రమత్తమయ్యారు. పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టడంతోపాటు సరిహద్దు ప్రాంతానికి ప్రత్యేక పోలీసు బలగాలను తరలిస్తూ కూంబింగ్ ఆపరేషన్ చేపడుతున్నారు. అడుగడుగునా తనిఖీలు నిర్వహిస్తున్నారు. గతంలో మావోయిస్టులు సరిహద్దు ప్రాంతంలో ఉన్న సీఆర్‌పీఎఫ్ క్యాంపులు, పోలీస్ స్టేషన్లపై అడపా దడపా దాడులకు పాల్పడ్డారు. దూరంగా ఉండి క్యాంపుల వైపు పది పదిహేను నిమిషాలు లేదా గంట గంటన్నర పాటు కాల్పులు జరిపి.. వచ్చిన దారిన వెళ్లిపోయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. కానీ ఇప్పుడు మాత్రం మావోయిస్టులు పామేడులోని మూడు క్యాంపులపై ఏకకాలంలో ముప్పేట దాడికి దిగారు. నిరంతరాయంగా 10 గంటల పాటు గ్రెనేడ్లు, రాకెట్ లాంచర్లు వినియోగించడంతోపాటు క్యాంపులకు వెళ్లే రహదారులలో మందుపాతరలు పేల్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు.

దాడులకు హిడ్మా నేతృత్వం వహించాడా?

సుకుమా జిల్లాలోని పువ్వర్తి గ్రామానికి చెందిన, పోలీసు బలగాలపై దాడులు చేయడంలో దిట్టగా పేరుగాంచిన మోస్ట్ వాంటెడ్ మడివి హిడ్మా నేతృత్వంలో పామేడు దాడులు జరిగి ఉండవచ్చని ఇరు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. హిడ్మా గతంలో పోలీసు బలగాలను మట్టుబెట్టేందుకు పన్నిన పన్నాగాలను దృష్టిలో ఉంచుకుని దండకారణ్యానికి భారీగా, పకడ్బందీగా బలగాలను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. హిడ్మా స్వగ్రామమైన పువ్వర్తి పామేడుకు సుమారు 20 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. ఈ మార్గంలో పోలీసు క్యాంపులు ఏర్పాటవుతుండటంతో జీర్ణించుకోలేని హిడ్మా పామేడులోని మూడు క్యాంపులపై దాడులకు వ్యూహరచన చేశాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాడులకు నేతృత్వం వహిస్తే ఈ ప్రాంతంలోనే ఉండవచ్చనే అనుమానంతో కూంబింగ్ ఆపరేషన్‌కు ఇరు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం.

తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో యుద్ధమేఘాలు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాలతోపాటు తెలంగాణా రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలు, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, కోబ్రా, సీఆర్‌పీఎఫ్, గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ బలగాలను దండకారణ్యానికి తరలిస్తున్నారు. దీంతో సరిహద్దు ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. పామేడు, కిష్టారం, గొల్లపల్లి, ఆవుపల్లి, బాసగూడ, బైరంఘడ్ తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో ఇప్పటికే పోలీసు బలగాలు పెద్ద ఎత్తున కూంబింగ్ చేస్తున్నాయి. పామేడు సమీప ఆదివాసీ గ్రామాల్లో అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని, ప్రశ్నిస్తూ వివరాలు రాబట్టే ప్రయత్నాలు సాగిస్తున్నారు. క్యాంపులపై మావోయిస్టుల దాడులు, సరిహద్దుల్లో భారీగా పోలీసు బలగాల మోహరింపుతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ఆదివాసీలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

చిన్నారులను ఆదుకోండి..

- సింగరేణి క్వార్టర్‌లో కరెంట్ కట్ చేశారు
- 20 రోజులుగా చీకట్లో మగ్గుతున్నాం
- ఎమ్మెల్యేను కలిసి వేడుకున్న అమ్మమ్మ



ఎమ్మెల్యే కోరం కనకయ్యకు గోడు వినిపిస్తున్న చిన్నారుల అమ్మమ్మ శ్రీదేవి

ఇల్లెందు : తల్లిదండ్రుల మృతితో వీధిన పడిన చిన్నారుల బాగోగులన్నీ తామే చూసుకుంటామని మూడేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే హరిప్రియ, కలెక్టర్ అనుదీప్ హామీ ఇచ్చారు.. అయినా నేటికీ వారికందిన సాయం అంతంతే. కనీసం ఇల్లు కూడా లేకపోవడంతో వారి నివాసానికి సింగరేణి క్వార్టర్ ఇప్పించారు. అయితే అందులో 20 రోజుల క్రితం కరెంట్ కట్ చేశారు. దీంతో ఆ చిన్నారులు చీకట్లోనే మగ్గుతున్నారు. తమను ఆదుకోవాలంటూ వారి అమ్మమ్మ రావుల శ్రీదేవి ఎమ్మెల్యే కోరం కనకయ్యను గురువారం కలిసి వేడుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఇల్లెందు పట్టణంలోని 13వ నంబర్ బస్తీకి చెందిన భట్టు గణేష్ 2018లో కేన్సర్ వ్యాధితో మృతిచెందాడు. ఆ తర్వాత మూడు నెలలకే అతడి భార్య స్రవంతి కిడ్నీ సమస్యతో తనువు చాలించింది. ఇద్దరి మృతితో కుమారుడు కృశన్, కుమార్తె హిమానుజ(హరిప్రియ) భారం అమ్మమ్మపై పడింది. ఉండేందుకు ఇల్లు కూడా సరిగా లేక చిన్న రేకుల షెడ్డులో జీవిస్తుండగా చలించిన గణేష్ మిత్రుడు ఫణి నాటి మంత్రి కేటీఆర్‌కు ట్విటర్ ద్వారా వారి సమస్యను వివరించారు. దీంతో చిన్నారులను ఆదుకోవాలంటూ అప్పటి ఎమ్మెల్యే హరిప్రియ, కలెక్టర్ అనుదీప్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మికి కేటీఆర్ ఆదేశాలు జారీ చేశారు. హుటాహుటిన ఎమ్మెల్యే హరిప్రియ వారి ఇంటికి చేరుకుని చిన్నారుల విద్య, ఇతర అవసరాలకు సాయం అందిస్తానని, డబుల్‌బెడ్ రూం ఇల్లు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని చెప్పారు. తాత్కాలిక ఖర్చుల కోసం కొంత సాయం అందించి చేతులు దులుపుకున్నారు. సింగరేణిలో ఓ క్వార్టర్ ఇప్పించారు. అయితే సింగరేణి నిర్వాసితులు కానందున విద్యుత్ బిల్లు తాము చెల్లించలేమని సింగరేణి అధికారులు తేల్చిచెప్పారు. బిల్లు చెల్లించకపోవడంతో ఆ క్వార్టర్‌కు 20 రోజుల క్రితం కరెంట్ కట్ చేశారు. చిన్నారుల ఆలన పాలనకు ఒక్కొక్కరికి నెలకు రూ.2వేల చొప్పున ప్రకటించగా, ఆరు నెలల నుంచి ఆ నిధులు కూడా విడుదల కావడం లేదు. పట్టణంలోని మార్గదర్శిని స్కూల్లో మాత్రం ఉచిత విద్య అందుతోంది.

సమస్య పరిష్కారానికి కృషి

చిన్నారుల అమ్మమ్మ శ్రీదేవి ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి గోడు వెలిబుచ్చగా.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి సరఫరా పునరుద్ధరిస్తామని, ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం కూడా అందేలా ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు.

నర్సరీ పనుల పరిశీలన



సుజాతనగర్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న మధుసూదన్ రాజు

చుంచుపల్లి/సుజాతనగర్ : చుంచుపల్లి మండలం నందతండా, విద్యానగర్, రామాంజనేయ కాలనీ, పెనుబల్లి గ్రామాలతో పాటు సుజాతనగర్‌లో ఏర్పాటుచేసిన హరితహారం నర్సరీలను అదనపు కలెక్టర్ జి.మధుసూదన్‌రాజు గురువారం పరిశీలించారు. నర్సరీల్లో చేపట్టాల్సిన పనులపై ఈజీఎస్ సిబ్బందికి సూచనలు చేశారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. ఖాళీ బ్యాగుల్లో మట్టి నింపి విత్తనాలు వేసి మొక్కలు వచ్చేలా చూడాలని, వన సంరక్షకుల ద్వారా ఎప్పటికప్పుడు నీళ్లు పడుతూ మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో చుంచుపల్లి ఎంపీడీఓ మంగమ్మ, ఎంపీఈఓ జి.సత్యనారాయణ, సుజాతనగర్ ఏపీఓ చందర్, పంచాయతీ కార్యదర్శి బి.నరేందర్, ఉపాధి సిబ్బంది రఘుపతి, పిల్లి నాగరాజు, స్వాతి, కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, బొంతు బాబురావు, ఇందిర, కార్తీక్ పాల్గొన్నారు.

డీసీసీబీపై బకాయిల బండ

- రూ.465 కోట్ల మేరకు వాయిదా మీరిన రుణాలు
- వసూళ్లపై అధికారుల ప్రత్యేక దృష్టి
- బకాయిదారులకు నోటీసులు, ఆపై చట్టపరంగా చర్యలు



ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: కొండలా పేరుకుపోయిన రుణ బకాయిల వసూళ్లపై జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆర్థిక సంవత్సరం ముగిసే సమయం ఆసన్నమవుతున్న నేపథ్యాన యంత్రాంగం ఈ అంశాన్ని ప్రథమ ప్రాధాన్యతగా చేపట్టింది. ఇందులో భాగంగానే తాజాగా డీసీఎంఎస్ చైర్మన్ కారును స్వాధీనం చేసుకోగా మిగతా రుణాల వసూళ్ల కోసం దూకుడుగా వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది.

నాలుగు జిల్లాల పరిధి...

డీసీసీబీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని బయ్యారం, గార్ల, వాజేడు వెంకటాపురం మండలాల్లో విస్తరించి ఉండగా, 100 పీఏసీఎస్‌లు, 50 బ్యాంకు బ్రాంచ్‌ల ద్వారా వివిధ వర్గాలకు సేవలందుతున్నాయి. సుమారు రూ.3వేల కోట్ల మేర లావాదేవీలతో కొనసాగుతున్న డీసీసీబీ ద్వారా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రుణాలు ఇస్తారు. రైతులకే కాక వ్యాపారులు, విద్యార్థులు, యువతకు కూడా వాహనాలు, గృహ రుణాలతో పాటు బంగారు ఆభరణాల తనఖాపై రుణాలు ఇస్తున్నారు. బ్యాంకు ద్వారా దాదాపు 75 రకాలుగా మొత్తం రూ.1,323.50 కోట్ల మేర రుణాలు ఇవ్వగా.. రూ.858.34 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. అయితే, ఇందులో రైతులు పంట రుణాలను ఏటా రెన్యువల్ చేసుకుంటారు.

వాయిదా మీరినవి రూ.465 కోట్లు

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో గడువు దాటినా చెల్లించని బకాయిలు రూ.465.16 కోట్లు ఉండగా వీటి వసూళ్లకు యంత్రాంగం నోటీసులు జారీ చేసింది. వ్యవసాయ సంబంధ రుణాలే కాక బంగారం తాకట్టు, వీధి వ్యాపారులు, డిపాజిట్లపై రుణాలు, వ్యక్తిగత తదితర రుణాలు ఇందులో ఉన్నాయి. ఈ బకాయిల వసూళ్ల కోసం యంత్రాంగం రంగంలోకి దిగింది.

తొలుత నోటీసులు

వాయిదా మీరి బకాయి కలిగిన వారికి సహకార నిబంధనల మేరకు డీసీసీబీ యంత్రాంగం నోటీసులు జారీ చేస్తోంది. దీంతో కొందరు బకాయిలు చెల్లిస్తున్నారు. మిగతా వారిపై చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా డీసీఎంఎస్ చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు కారు రుణం తీసుకుని సకాలంలో చెల్లించకపోవడంతో వాహనాన్ని సీజ్ చేశారు. ఇదే తరహాలో మిగతా బకాయిదారులపై వ్యవహరించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

డీసీసీబీ పరిధిలో రుణాలు, వసూలు, బకాయి వివరాలు (రూ.కోట్లలో)
(2023 డిసెంబర్ 31 వరకు)

ఇచ్చిన రుణాలు	రూ.1,323.50
వసూలైన మొత్తం	రూ.858.34
బకాయి	రూ.465.16

చట్టప్రకారం వసూళ్లు

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నుంచి అప్పులు తీసుకొని నిర్దేశిత గడువులోగా చెల్లించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. వాయిదా మీరిన బకాయిదారులకు నోటీసులు ఇస్తున్నాం. నోటీసుల్లో పేర్కొన్న విధంగా బకాయిలు చెల్లించని పక్షంలో చర్యలు తీసుకుంటున్నాం. రుణాలకు సంబంధించిన ఆస్తులు జప్తు చేస్తున్నాం. బకాయిదారులు అప్పులు చెల్లించాలని కోరుతున్నాం.

– వెంకటేశ్వర్లు, జాయింట్ రిజిస్ట్రార్, సహకార శాఖ, ఖమ్మం

క్లుప్తంగా

'స్టాటిస్టిక్స్' పరీక్షకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

మణుగూరు రూరల్ : ఈనెల 28, ఫిబ్రవరి 3, 4 తేదీల్లో సీఆర్ రావు ఏఐఎంఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్టాటిస్టిక్స్ ఒలంపియాడ్ ప్రిలిమ్స్ పరీక్షకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పరీక్ష ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్, మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. జూనియర్ లెవల్‌లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు, సీనియర్ లెవల్‌లో ఇంటర్, డిగ్రీ విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్టాటస్టిక్స్ ఒలంపియాడ్ వెబ్ సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని పరీక్షలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతిభ కనబర్చిన వారిలో ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.15 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.5వేల చొప్పున అందజేయనున్నట్లు వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెంలో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర డిగ్రీ కళాశాలలో తాత్కాలిక పార్ట్ టైం అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ స్వప్నకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ నెల 19, 20 తేదీల్లో ఆసక్తి ఉన్న అభ్యర్థులు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత విభాగంలో 55 శాతం మార్కులతో పీజీ అర్హత ఉండాలని, సెట్, నెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. అభ్యర్థులు ఈ నెల 23న డెమో క్లాసుకు హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన


మాట్లాడుతున్న సకలారెడ్డి

జూలూరుపాడు: కుష్ఠు వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలపై తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కుష్ఠు విభాగం డిప్యూటీ పీఎంఓ డాక్టర్ సకలారెడ్డి అవగాహన కల్పించారు. గురువారం జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఏఎస్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కుష్ఠు రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఎండీటీ ద్వారా కుష్ఠు వ్యాధిని పూర్తి నివారించవచ్చునన్నారు. ఏపీఎంఓ అరుణ, జిల్లా డీపీఎంఓలు జి.గన్యా నాయక్, ఐ వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్‌కుమార్, హెచ్‌ఎస్ రత్నకుమార్, హెచ్‌వీలు సుభద్రమ్మ, రాధిక, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీల నిర్వాహకుడిపై కేసు నమోదు

అశ్వాపురం: మండలంలో ఇటుకబట్టీలలో బాలకార్మికులతో పనులు చేయిస్తున్నారనే సమాచారంతో కార్మిక శాఖ అధికారులు గురువారం తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మైనర్ బాలికతో పనులు చేయిస్తున్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటుక బట్టీల నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపతిరావు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన మినీ వ్యాన్


విరిగి వ్యాన్‌పై పడిన కరెంట్ స్తంభం

పాల్వంచ: మినీ వ్యాన్ ఢీకొని విద్యుత్ స్తంభం విరిగిపోయిన సంఘటన గురువారం జరిగింది. పాల్వంచ వైపు నుంచి కొత్తగూడెం వైపు వెళుతున్న మినీ వ్యాన్ బీసీఎం రోడ్‌లో లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్ సమీపంలో అతివేగంగా వచ్చి రోడ్డు పక్కన ఉన్న కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగి వ్యాన్‌పై పడగా, వ్యాన్ ముందు భాగం దెబ్బతింది. డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పినట్లయింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు, ఎన్‌పీడీసీఎల్ అధికారులు సందర్శించారు. వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. స్తంభం విరగడంతో నష్టపరిహారానికి ప్రతిపాదనలు పంపినట్లు ఏఈ మధుబాబు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

'ఆధార్' గోస..


ఇల్లెందు బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద ఆధార్ కేంద్రంలో బారులుదీరిన జనం

- మీ సేవ కేంద్రాల వద్ద తెల్లవారుజాము నుంచే బారులు
- రోజూ దూరప్రాంతాల నుంచి ప్రజల రాకపోకలు
- రద్దీ, కంప్యూటర్ల మరమ్మతులతో తీవ్ర జాప్యం
- పాఠశాలలు, కళాశాలల్లో పాఠాలు కోల్పోతున్న విద్యార్థులు
- ఆధార్, సెల్ నంబర్ లింక్ ప్రక్రియకు అవస్థలు

ఇల్లెందు: ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం జనం అవస్థ పడుతున్నారు. తెల్లవారుజాము నుంచే మీ సేవ కేంద్రాల వద్ద బారులుదీరుతున్నారు. ఇలా రోజుల తరబడి తిరుగుతున్నా ఆధార్‌కు సెల్ నంబర్ లింక్ కావడం లేదు. మరోవైపు విద్యాసంస్థలతోపాటు సంక్షేమ పథకాలు పొందాలంటే సెల్ నంబర్ లింకై ఉండాలని నిబంధనలు విధిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇల్లెందు మున్సిపల్, బీఎస్‌ఎన్‌ఎల్, పోస్టల్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఒక్కోటి చొప్పున నాలుగు ఆధార్ కేంద్రాలు ఉన్నాయి. వీటి వద్దకు ఇల్లెందుతోపాటు టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల, కారేపల్లి, బయ్యారం మండలాల నుంచి పలువురు వచ్చి క్యూ కడుతున్నారు. గురువారం పాత బస్టాండ్ సెంటర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్, పోస్టాఫీస్ సెంటర్ల వద్ద ప్రజలు పోటెత్తారు. ఉదయం 8 గంటల వరకే నాలుగు కేంద్రాల వద్ద వెయ్యి మంది వరకు చేరారు. రోజంతా పడిగాపులు కాసినా ఆధార్ మాత్రం లింక్ కావటం లేదని వెనుదిరిగి పోతున్నారు.

మొరాయిస్తున్న కంప్యూటర్లు

విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లకుండా ఆధార్ కేంద్రాలకు వస్తున్నారు. కొందరు ఆరు నెలల నుంచి తిరుగుతున్నా ఆధార్‌కు సెల్ నంబర్ అనుసంధాన ప్రక్రియ పూర్తికావడంలేదు. దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో వస్తుండగా, కంప్యూటర్లు కూడా మొరాయిస్తున్నాయి. ఒక్కో కేంద్రంలో రోజుకు సుమారు 50 మంది చొప్పున నాలుగు కేంద్రాల్లో 200 మంది దరఖాస్తులే సబ్మిట్ చేస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో ఉన్న కాలం చెల్లిన కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు తరచు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇటీవల కాలంలో మరమ్మతుల పేరుతో గంటల కొద్దీ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారు. ప్రత్యామ్నాయంగా జనరేటర్‌లు, బ్యాటరీలు, సోలార్ విద్యుత్ సదుపాయం లేదు. దీంతో ఆధార్ కేంద్రాలు పనిచేయని పరిస్థితి నెలకొంటోంది.

కొరవడిన పర్యవేక్షణ..

మీ సేవ కేంద్రాలపై ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడింది. నిర్వహణ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించినా నిధులు పూర్తిస్థాయిలో కేటాయించడంతో సక్రమంగా పనిచేయడంలేదు. కేంద్రాల్లో తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించడంలేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఇబ్బందులు తప్పడంలేదు. ఉపయోగపడని ఫర్నిచర్‌ను కేంద్రాల్లోనే వదిలేడంతో స్టోర్ రూమ్‌ను తలపిస్తున్నాయి.

అధిక చార్జీల వసూళ్లు

ఆధార్ అప్‌డేషన్ కోసం ఒక్కొక్కరి నుంచి రూ.300 నుంచి రూ.400 వరకు వసూళ్లు చేస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో పొందే సేవలకు ప్రభుత్వం చార్జీలు ఖరారు చేసినా నిర్వాహకులు అంతకు మించి రాబడుతున్నారు. ఇక మండల, జిల్లాస్థాయి అధికారులు ఎవరూ కేంద్రాలను తనిఖీ చేయడంలేదు. దీంతో నిర్వాహకుల ఇష్టారాజ్యంగా మారింది.

వారం నుంచి తిరుగుతున్నా...



ఇల్లెందు మండలం సుదిమళ్ల గ్రామం నుంచి పిల్లల ఆధార్ అప్‌డేట్ కోసం వారం నుంచి తిరుగుతున్నాను. ఆధార్‌కు సెల్ నంబర్ లింక్ చేయకుండా బడికి పంపిస్తే ఏదైనా ప్రభుత్వ పథకం అందటం కష్టంగా ఉందని అంటున్నారు. పిల్లల చదువుకూ ఇబ్బందే. – అశోక్, సుదిమళ్ల, ఇల్లెందు మండలం

నాలుగు రోజులుగా వస్తున్నా..



టేకులపల్లి నుంచి ఆధార్ లింక్ కోసం నాలుగు రోజులుగా బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన కేంద్రం చుట్టూ తిరుగుతున్నాను. రోజుకు 50 మందికే దరఖాస్తు చేస్తున్నారు. ఇప్పటివరకు రూ. ఐదారు వేలు ఖర్చు అయిపోయింది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

– ఇస్లావత్ శంకర్, టేకులపల్లి

గుండాలలో సెంటర్ లేదు



మాది గుండాల మండలం వేపలగడ్డ గ్రామం. గుండాలలో అప్‌డేషన్‌కు అవకాశం లేకపోవడంతో ఐదు రోజులుగా ఇల్లెందుకు వస్తున్నా. అధికారులు స్పందించి గుండాలకు మూడు ఆధార్ కేంద్రాలు మంజూరు చేయాలి.

– గొగ్గెల కాంతారావు, వేపలగడ్డ, గుండాల మండలం

ఎవరూ పట్టించుకోరు



15 రోజులుగా టేకులపల్లి మండలం తొమ్మిదోమైలు తండా నుంచి ఇల్లెందుకు వస్తున్నా. రికార్డులో పేరు నమోదు చేసుకున్నా క్రమ పద్ధతి ప్రకారం చేయటం లేదు. కలెక్టర్, ఇతర అధికారులు, ఎమ్మెల్యే.. ఎవరూ ఈ కేంద్రాల వైపు రావటం లేదు.

–అజ్మీరా రమేష్, 9వ మైలు తండా, టేకులపల్లి మండలం

కూలిన గ్రీన్‌ఫీల్డ్ హైవే బ్రిడ్జి స్లాబ్..

- నిర్మాణ దశలో ఉండగా కూలిన వైనం
- నలుగురు కూలీలకు స్వల్ప గాయాలు
- వైరా – జగ్గయ్యపేట రహదారిపై ఘటన


కూలిన నిర్మాణంలోని బ్రిడ్జి


వంగిపోయిన సపోర్ట్ రాడ్లు

వైరా: ఖమ్మం – దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణంలో నాణ్యత పాటించడం లేదని వస్తున్న విమర్శలకు బలం చేకూర్చేలా ఘటన గురువారం చోటు చేసుకుంది. ఖమ్మం జిల్లా వైరా – ఏపీలోని జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై సోమవరం గ్రామ సమీపాన గ్రీన్‌ఫీల్డ్ హైవే బ్రిడ్జి నిర్మాణ పనులు రెండు నెలలుగా కొనసాగుతున్నాయి. సుమారు 70మీటర్ల పొడవైన బ్రిడ్జిపై గురువారం స్లాబ్ వేస్తుండగా ఒక్కసారిగా కూలిపోవడంతో నలుగురు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సమయాన పది మంది వరకు పని చేస్తుండగా భయంతో బ్రిడ్జి పైనుంచి కిందకు దూకే యత్నంలో గాయపడినట్లు చెబుతున్నారు. హైవే నిర్మాణ పనులను హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్ కంపెనీ చేపడుతుండగా.. స్లాబ్ కోసం వేసిన సపోర్టు రాడ్లు నాసిరకంగా ఉండడంతోనే కూలినట్లు తెలుస్తోంది. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడం, బీమ్‌ల విషయంలో జాగ్రత్తలు పాటించకపోవడంతో ఈ ఘటన జరిగిందని స్థానికులు చెబుతున్నారు. కాగా, గాయపడిన కూలీలను చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించగా, ఘటనాస్థలికి హైవే అధికారులు చేరుకుని విచారణ ప్రారంభించారు.

టెట్ నుంచి టీచర్లకు మినహాయింపు ఇవ్వాలి


రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

పాల్వంచరూరల్: ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించే విషయంలో టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లిలోని కొమురం భీం భవనంలో జిల్లా అధ్యక్షుడు బుటారి రాజు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఖమ్మంలో వచ్చేనెల 11, 12వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్లు, టీపీటీఎఫ్ క్యాలెండర్లు ఆవిష్కరించాక నాగిరెడ్డి మాట్లాడారు. టీచర్లకు పదోన్నతుల విషయంలో టెట్ తప్పనిసరి చేస్తే ఉద్యమిస్తామని తెలిపారు. అలాగే, కామన్ స్కూల్ విధానాన్ని అమలుచేయాలని, కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.హరిలాల్‌నాయక్‌తో పాటు వి.మనోహర్, ఎం.రామాచారి, ఎస్.పూర్ణచందర్‌రావు, సభ్యులు గుమ్మడి సమ్మయ్య, జె.రాంబాబు, సత్తిబాబు, సరళ, శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, కె.మాధవరెడ్డి, బి.రమేశ్, రామచంద్, బాలు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుబడ్డ నిందితులతో ఎక్సైజ్ అధికారులు

చండ్రుగొండ : మండలకేంద్రం చండ్రుగొండలో చింతూరు నుంచి ఆంధ్రప్రదేస్ రాష్ట్రానికి ద్విచక్ర వాహనంపై అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జూలూరుపాడు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బుధవారం రాత్రి చండ్రుగొండలోని పెట్రోల్‌బంకు వద్ద జూలూరుపాడు ఎస్‌ఐ పురుశోత్తం వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఏపీకి చెందిన గణేష్, సంతోష్‌ల వద్ద 8 కిలోల 15 గ్రాముల గంజాయి లభించినట్లు సీఐ తెలిపారు. గంజాయి విలువ రూ. 1.60 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశామని తెలిపారు.

ఇల్లెందులో 5.5 కేజీలు..

ఇల్లెందురూరల్: అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం పట్టుకున్నారు. తనిఖీలు చేపట్టిన ఖమ్మం సీఐ సర్వేశ్వర్, ఇల్లెందు సీఐ రాంప్రసాద్‌లు బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులను సోదా చేయగా 5.5 కిలోల గంజాయి లభించింది. యాదాద్రి జిల్లా బీబీనగర్‌కు చెందిన నందగిరి వరుణ్, ములిగొండ మల్లేశం బైక్‌పై ఏపీలోని చింతూరు మండలం నుంచి గంజాయి కొనుగోలు చేసి బీబీనగర్‌లో విక్రయించేందుకు వెళ్తున్నట్లు విచారణలో తేలింది. ఇద్దరిని అదుపులోకి తీసుకుని, బైక్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని అంచనా.

అవిశ్వాసం సమసినట్టేనా..?

పొంగులేటిని కలిసిన ఇల్లెందు నేతలు


పొంగులేటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జానీపాషా, పక్కన ఎమ్మెల్యే కనకయ్య తదితరులు

ఇల్లెందు: రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఇల్లెందుకు చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ జానీపాషా, సిలివేరు సత్యనారాయణ గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మువ్వా విజయబాబుతో కలిసి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై అవిశ్వాసం అంశం కూడా చర్చించినట్లు తెలిసింది. అయితే ఎన్నికల ముందు తమ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినందున నమ్మి వచ్చిన డీవీకి అన్యాయం జరగరాదని పొంగులేటి వారికి సూచించినట్లు తెలిసింది. అవిశ్వాసం అనే చర్చ విరమించుకోవాలని, అంతా కలిసి పని చేయాలని సూచించినట్లు సమాచారం. ఈ తరుణంలో అవిశ్వాసం ప్రకటించి చైర్మన్ పదవి కైవసం చేసుకునేందుకు ప్రణాళిక వేసుకున్న గణేష్ కూడా అక్కడే ఉన్నారని తెలిసింది. అందరికీ ఒకే మాట చెబుతున్నానని, ఇతర విషయాలేమైనా ఉంటే ఎమ్మెల్యేతో మాట్లాడాలని పొంగులేటి అన్నట్లు సమాచారం.

కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: తనపై ముగ్గురు యువకులు దాడి చేశారని పట్టణంలోని ముదిరాజ్ బజార్‌కు చెందిన యువకుడు మర్గాని సందీప్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ పీవీఎన్ రావు తెలిపారు.

22న భద్రాద్రిలో ప్రత్యేక కార్యక్రమాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఈనెల 22న అయోధ్య శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్య కల్యాణ మండపంలో ఉదయం 7 నుంచి 7.30 వరకు స్వామివారికి సువర్ణ పుష్పార్చన, అనంతరం ఆలయం నుంచి ప్రచార రథంలో అంబేడ్కర్ సెంటర్ వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శోభాయాత్రలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు 500 కాషాయ జెండాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సుందరాకాండ పారాయణం, దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

యూసుఫ్ టోర్నీ విజేత గుంటుపల్లి ఎలెవన్


విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న ఎస్సై తదితరులు

బూర్గంపాడు: బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వారం రోజులుగా జరుగుతున్న 16వ యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ గురువారం ముగిసింది. ఫైనల్స్‌లో భద్రాచలం గుంటుపల్లి ఎలెవన్ జట్టు విజేతగా నిలిచింది. బూర్గంపాడు స్కై ఎలెవన్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన భద్రాచలం గుంటుపల్లి ఎలెవన్ జట్టు 13.2 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 130 పరుగులు చేసి విజయం సాధించింది. గుంటుపల్లి ఎలెవన్ జట్టులోని ప్రేమ్ 82 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దక్కించుకున్నాడు. ప్రేమ్ మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గానూ నిలిచాడు. అనంతరం విన్నర్ జట్టుకు రూ.30వేల నగదు బహుమతి, ట్రోఫీని అందజేశారు. రన్నర్ జట్టుకు రూ.15వేల నగదు బహుమతిని, ట్రోఫీని అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, సర్పంచ్ సిరిపురపు స్వప్న, మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ్‌గాంధీ, దేగల రాజుయాదవ్, బొల్లు రవికుమార్, గుంటుపల్లి రామకృష్ణ, ముత్యాల కిషోర్, షేక్ సాధిక్, ఎండీ నజీరుద్దీన్, ఎండీ సోహైల్‌పాషా, గోనెల నాని, భజన ప్రసాద్, షేక్ అబ్దుల్ సలీమ్, కన్నెబోయిన సారధి, బబ్బురాయుడు, శనగ కిషోర్, మందా ప్రసాద్, అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దుప్పి చర్మం స్వాధీనం..

జీడిమామిడితోటలో గుర్తించిన స్థానికులు


జీడి మామిడి చెట్టుపై వేసిన దుప్పి చర్మం

ములకలపల్లి : జీడిమామిడి తోటలో ఆరేసి ఉన్న దుప్పి చర్మాన్ని గుర్తించిన స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించగా వారు స్వాధీనం చేసుకున్న ఘటన ములకలపల్లి మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధిలోని తాళ్లపాయ గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు కూతవేటు దూరంలో గల జీడీమామిడితోటలో గురువారం ఉదయం కుక్కలు మొరుగుతుండగా కొందరు అక్కడికి చేరుకున్నారు. ఓ చెట్టుకొమ్మపై దుప్పిచర్మం ఉండడంతో గమనించి, అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. సమీప అటవీ ప్రాంతంలో ఐదు, ఆరు నెలల వయసు గల దుప్పిపిల్లను వేటాడినట్లు తెలుస్తోంది. జీడిమామిడి తోటలో తోలుతీసి ముక్కలుగా కోసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. స్థానికుల సమాచారం మేరకు డీఆర్‌ఓ రాము, ఎఫ్‌బీఓ మహేశ్ ఘటనాస్థలికి చేరుకుని దుప్పి చర్మాన్ని స్వాధీనం చేసుకుని ములకలపల్లి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో భద్రపరిచారు. ములకలపల్లి ఎఫ్‌ఆర్‌ఓ రవికిరణ్, ఎస్సై రాజమౌళి క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించారు. ఘటనపై సమగ్ర విచారణ చేపడతామని, దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌ఆర్‌ఓ తెలిపారు.

నాటు తుపాకీతో వేటాడారా..?

అటవీ ప్రాంతంలో అర్ధరాత్రి వేళల్లో నాటుతుపాకీ శబ్దాలు వినిపిస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. కొందరు స్థానికుల సహకారంతో ఈ ప్రాంతంలో వేట సాగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాలను హతమారుస్తూ గుట్టుచప్పుడుకాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయని అంటున్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరు మృతి

అశ్వారావుపేటరూరల్: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఆసుపాక కాలనీ గ్రామానికి చెందిన కొర్రి సత్యనారాయణ(25) తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అశ్వారావుపేటకు ద్విచక్రవాహనంపై వస్తుండగా అదే సమయంలో ఏపీలోని ఏలూరు వద్దగల విజయరాయికి చెందిన ఇనపర్తి రాజ్‌కుమార్‌కు మరో ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో తిమ్మాపురం సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందగా, రాజ్‌కుమార్‌ను ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా మృతుడు సత్యనారాయణకు భార్య కావేరి, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. ఎస్‌ఐ పి.శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల పట్టివేత


ట్రాలీలో తరలిస్తున్న పశువులు

పాల్వంచ/పాల్వంచరూరల్: అక్రమంగా తరలిస్తున్న పశువులను రూరల్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. మోరంపల్లి బంజర నుండి కొత్తగూడేనికి ట్రాలీ ఆటోలో 9 పశువులను తరలిస్తుండగా మండలంలోని జగన్నాథపురం వద్ద పట్టుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ బి. శ్రీనివాస్ తెలిపారు. పశువులను సంరక్షణ నిమిత్తం అన్నపూర్ణ గోశాలకు అప్పగించినట్లు నిర్వాహకులు ఆంజనేయ శర్మ పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న బాలుడి మృతి


తండ్రీ కొడుకుల మృతదేహాలు

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడు సమీపంలోని నాయక్ రైస్ మిల్లు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో వినోభానగర్ గ్రామానికి చెందిన గుగులోత్ పవన్ కల్యాణ్(25) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మృతుడి రెండేళ్ల కుమారుడు కుశాల్ తీవ్ర గాయాలైన విషయం విదితమే. కుశాల్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడు. తండ్రి, కొడుకుల మృతితో వినోభానగర్ శోకసంద్రంగా మారింది. గర్భిణిగా ఉన్న పవన్ కల్యాణ్ భార్య సంగీత కన్నీరుమున్నీరుగా విలపించింది. భర్త, కుమారుడి మృతదేహాల వద్ద ఆమె రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను అప్పగించగా, కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు.

ప్రైవేట్ అంబులెన్స్‌లో బాలుడి తరలింపు

బాలుడిని జూలూరుపాడు ప్రభుత్వాస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించేందుకు 108 అంబులెన్స్ అందుబాటులో లేదు. దీంతో గంటపాటు ఎదురు చూసి, ప్రైవేట్ అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. ప్రమాదస్థలి నుంచి బాలుడ్ని ఆస్పత్రికి తరలించే విషయంలో కూడా సుమారు అరగంటపైగా ఆలస్యం జరిగింది. ఆస్పత్రిలో అనుభవం ఉన్న వైద్యులు, పరికరాలు లేకపోవడంతోపాటు ఖమ్మం తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో బాలుడు మృతి చెందాడని పలువురు ఆరోపిస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Wanted

■ ఖమ్మం లోకల్ ప్రముఖ సంస్థలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు & సూపర్‌వైజర్స్ కావలెను. జీతం: 11-13 వేలు, 12 గంటల డ్యూటీ. 7036191924, 8121046046. [M-1167600]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926 [G-8443]

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182, 9010299957
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బాబు తోడుదొంగ ఈశ్వరన్ ఔట్

పదవులు, పార్టీకి సింగపూర్ మంత్రి రాజీనామా.. తీవ్ర అభియోగాలతో చార్జ్‌షీట్లు దాఖలు

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి పేరిట ఏపీ మాజీ సీఎం చంద్రబాబు సాగించిన భూ దోపిడీలో కీలక పాత్రధారిగా వ్యవహరించిన సింగపూర్ మాజీ మంత్రి ఎస్.ఈశ్వరన్ కథ ముగిసింది. రవాణా శాఖ మంత్రి పదవితోపాటు ఎంపీ సభ్యత్వానికి, సింగపూర్ అధికార పీపుల్స్ యాక్షన్ పార్టీ(పీఏపీ) ప్రాథమిక సభ్యత్వానికి ఆయన రాజీనామా చేసి ఇంటిదారి పట్టారు. ఆయన ఈ నెల 12న రాజీనామా చేసిన విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. ఇక దర్యాప్తు ప్రక్రియ ముగిసి నేరాలు రుజువు కావడమే తరువాయి ఆయన జైలు పక్షిగా మారనున్నట్లు స్పష్టమైంది. సింగపూర్ ఫార్ములా వన్ రేసింగ్ కాంట్రాక్టులో ఈశ్వరన్ అక్రమాలకు తెగబడి ఏకంగా 2.98 లక్షల అమెరికన్ డాలర్ల మేర భారీ అవినీతికి పాల్పడినట్టు సింగపూర్ అవినీతి నిరోధక విభాగం 'కరెప్ట్ ప్రాక్టీసెస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' (సీపీఐబీ) నిగ్గు తేల్చింది. 27 అభియోగాలతో తాజాగా చార్జ్‌షీట్లు దాఖలు చేసింది. వాటిలో ఆయన మంత్రి హోదాలో భారీ ముడుపులు తీసుకున్నట్టు 24 అభియోగాలు, అవినీతికి కేంద్ర బిందువుగా ఉన్నారని రెండు అభియోగాలు, న్యాయ విచారణకు అడ్డంకులు కల్పించారని ఒక అభియోగం ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. నేరం రుజువైతే ఈశ్వరన్‌కు లక్ష డాలర్ల జరిమానాతోపాటు కనీసం ఏడేళ్ల జైలు శిక్ష పడుతుందని సింగపూర్ న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఈశ్వరన్ వ్యవహారం టీడీపీలో గుబులు పుట్టిస్తోంది. స్కిల్ స్కామ్ కేసులో అరెస్టై 52 రోజులు రిమాండ్ ఖైదీగా గడిపి బెయిల్‌పై విడుదలైన చంద్రబాబు తాజా పరిణామాలతో ఆందోళన చెందుతున్నట్లు స్పష్టమవుతోంది.

కాకినాడలో భారీ ఎల్‌ఎన్‌జీ ఫ్లోటింగ్ టెర్మినల్

సాక్షి, అమరావతి: నార్వేకు చెందిన క్రౌన్ ఎల్ఎన్‌జీ ఏపీలో భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. కాకినాడ వద్ద సముద్రంలో రూ.8,300 కోట్లతో ఫ్లోటింగ్ లిక్విఫైడ్ న్యాచురల్ గ్యాస్ టెర్మినల్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది. ఎల్ఎన్‌జీని దిగుమతి చేసుకుని దానిని రీగ్యాసిఫికేషన్ చేసి దేశంలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేసే విధంగా 7.2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఈ టెర్మినల్‌ను అభివృద్ధి చేయనున్నట్లు క్రౌన్ ఎల్ఎన్‌జీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్వపన్ కటారియా ప్రకటించారు.



సామాజిక న్యాయ శిల్పం.. నేడు జాతికి అంకితం

- అంబేడ్కర్ స్మృతివనం పనులు పూర్తి
- ఏపీ సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా నేడు ఆవిష్కరణ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: స్వాతంత్ర్యోద్యమంలో ఎన్నో చారిత్రక సమావేశాలకు వేదికగా నిలిచిన బెజవాడ స్వరాజ్య మైదానంలో నిర్మిస్తున్న భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు పూర్తిచేసుకుని ప్రారంభానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. చరిత్రలో నిలిచిపోయేలా రూపుదిద్దుకున్న సామాజిక న్యాయ మహాశిల్పం జాతికి అంకితమిచ్చే తరుణం వచ్చేసింది. అద్భుతమైన ప్రాజెక్టుగా రూపుదిద్దుకున్న ఈ స్మృతివనం పనులను మహాయజ్ఞంలా పూర్తిచేశారు. అత్యంత అందంగా తీర్చిదిద్దుతున్న ఈ ప్రాంగణం ప్రపంచస్థాయి పర్యాటకులను సైతం ఆకర్షించే వేదికగా మారనుంది. దేశంలో మతాతీతమైన విగ్రహాల్లో ఇదే అతిపెద్దది కావడం విశేషం. 206 (81 అడుగుల బేస్, 125 అడుగుల విగ్రహం) అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహం నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. రాత్రివేళ ప్రత్యేక కాంతులతో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలుస్తోంది, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ఈ ప్రాజెక్టును పర్యవేక్షించి, అత్యంత అద్భుతంగా రూపొందించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

నిత్యం అధికారులతో మాట్లాడుతూ పనులు పరుగులు పెట్టించారు. ఇలా స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ (సామాజిక న్యాయ మహా శిల్పం)ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారు. ఈ అరుదైన అంబేడ్కర్ సామాజిక న్యాయ విగ్రహాదే ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరిస్తున్నారు. ఇక స్మృతివనాన్ని వీక్షించేందుకు ఈ నెల 20 నుంచి సామాన్య ప్రజలకు ప్రవేశం కల్పించనున్నారు.

పల్లెల్లో 'ప్రత్యేక'మే!

▶ మొదటి పేజీ తరువాయి

రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు గతంలో 'ట్రిపుల్ టెస్ట్' పేరిట మార్గదర్శకాలు ఇచ్చింది. స్థానిక సంస్థల పరిధిలో ఆయా గ్రూపుల వెనుకబాటు స్వభావంపై బీసీ కమిషన్ ద్వారా విచారణ జరపాలని.. ఆయా చోట్ల ఏ నిష్పత్తిలో రిజర్వేషన్లు ఇవ్వాలనేది తేల్చాలని సూచించింది. మొత్తంగా రిజర్వేషన్లు (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కలిపి) 50 శాతం మించకుండా ఉండాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు, మార్పుల కోసం బీసీ కమిషన్ విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సి ఉంది. దాని ఆధారంగానే పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను పెంచేందుకు వీలు కానుంది.

ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూపులు!

చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ ఆధ్వర్యంలోని రాష్ట్ర బీసీ కమిషన్.. 'ట్రిపుల్ టెస్ట్' అంశంలో అనుసరించిన విధానాలపై ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు పూర్తిచేసినట్టు సమాచారం. ప్రభుత్వానికి నివేదిక సమర్పించే విషయంలో కమిషన్‌కు పూర్తి స్పష్టత లేక ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. కొత్త ఓటర్ల జాబితా వచ్చాక.. దాని ఆధారంగా మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలను నోడల్ ఏజెన్సీలుగా పెట్టి ఆ వివరాలు సేకరించి ఇవ్వాలని భావిస్తున్నట్టు బీసీ కమిషన్ వర్గాలు చెప్తున్నాయి. అయితే ఓటర్ల జాబితా ద్వారానా? లేక సామాజిక, ఆర్థిక, కుల సర్వే ఆధారంగా వెళ్లాలా అన్న దానిపై ప్రభుత్వపరంగా ఎలాంటి సంకేతాలు రాకపోవడంతో సందిగ్ధత ఏర్పడినట్టు సమాచారం. లోక్‌సభ ఎన్నికలు ముగిశాక పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, ఆలోగా బీసీ కమిషన్ నివేదిక ప్రక్రియ పూర్తవుతుందని రాష్ట్ర సర్కారు భావిస్తున్నట్టు తెలిసింది.

మొత్తం 12,751 పంచాయతీలు..

రాష్ట్రంలో ప్రస్తుతం 12,751 గ్రామ పంచాయతీలకు (కొత్తగా ఏర్పాటు చేసినవి కలిపితే మొత్తం 12,772 పంచాయతీలు) సర్పంచ్‌లు ఉన్నారు. వార్డు సభ్యులు సుమారు లక్షా 27 వేల మంది వరకు ఉంటారు. తెలంగాణ నూతన పంచాయతీరాజ్ చట్టం–2018 ప్రకారం.. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిపోయాక పర్సన్ ఇన్‌చార్జులుగా నియమించే అవకాశం లేదు. దీనితోపాటు సకాలంలో ఎన్నికలు జరగకపోతే గ్రామ పంచాయతీలకు 'స్పెషల్ ఆఫీసర్'లను నియమించాల్సి ఉంటుంది.

- ఉమ్మడి ఏపీలో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు.. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో 2011–2013 మధ్య పంచాయతీలు స్పెషల్ ఆఫీసర్ల పాలనలో కొనసాగాయి. అంతకుముందు చంద్రబాబు సర్కారు హయాంలోనూ గడువులోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించని కారణంగా, అంతకుముందున్న సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జులుగా కొనసాగించారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతిపాదనలు పంపినా..!

రాజ్యాంగం ప్రకారం పంచాయతీరాజ్ సంస్థల ఐదేళ్ల పదవీకాలం ముగిసేలోపే.. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందే ఎన్నికలు పూర్తిచేయాలి. ఈ క్రమంలో రాష్ట్రంలో జనవరి లేదా ఫిబ్రవరిలో మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ప్రభుత్వానికి గతంలోనే ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. కానీ దీనిపై గత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో.. కనీసం ఆరు నెలల వరకు పంచాయతీ ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. దీంతో అప్పటివరకు స్పెషలాఫీసర్ల పాలనలో కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది.

ప్రస్తుత సర్పంచ్‌లనే ఇన్‌చార్జులుగా కొనసాగించాలి

''ప్రస్తుతమున్న సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జులుగా కొనసాగించాలి. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించాం. గ్రామాల అభివృద్ధిపై మాకు పూర్తి అవగాహన ఉన్నందున ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో, పాలనలో జాప్యం జరగదు. స్పెషలాఫీసర్లకు గ్రామాల్లోని పరిస్థితులపై అవగాహన ఏర్పడేందుకే కొంత సమయం పడుతుంది. అధికారులు స్థానికంగా ఉండరు, ఆఫీస్ టైమ్ బట్టి వచ్చి వెళ్తుంటారు. మేం గ్రామాల్లోనే అందుబాటులో ఉంటాం. ఆరునెలల పాటు ఇన్‌చార్జులుగా పొడిగించాలి. కోవిడ్ మహమ్మారి కారణంగా దాదాపు మూడేళ్ల పదవీకాలాన్ని కోల్పోయాం. మాకు చెక్ పవర్ కూడా ఆరు నెలలు ఆలస్యంగా ఇచ్చారు. గతంలో చేసిన పనులకు ఇంకా బిల్లులు రావాల్సి ఉంది.

– ఉప్పుల అంజనీప్రసాద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం గౌరవాధ్యక్షుడు

స్పెషలాఫీసర్లతో పాలనకు ఇబ్బంది

''ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రస్తుత సర్పంచ్‌లకే పర్సన్ ఇన్‌చార్జులుగా బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుంది. గతంలో పనిచేసిన అనుభవం, విధుల నిర్వహణకు పనికొస్తుంది. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి దోహదపడతారు. వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదు కాబట్టి సర్పంచ్‌లనే మరో ఆరునెలల పాటు కొనసాగిస్తే గ్రామాల్లో మంచి ఫలితాలు వచ్చే అవకాశముంది. పరిపాలన ఇబ్బందులు లేకుండా సజావుగా సాగే అవకాశాలు ఉంటాయి. అదే స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులైన వారికి గ్రామంపై పట్టు రావడానికి.. ఆయా సమస్యలు, అంశాలపై అవగాహన ఏర్పడడానికి సమయం పడుతుంది.

– చింపుల సత్యనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు

చరిత్ర ఎరుగని సాహసం

ఏకంగా 31.19 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు: ఏపీ సీఎం జగన్



నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్ చెక్కును అందజేస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా దేశ చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా, ఎవరూ సాహసించని రీతిలో అక్కచెల్లెమ్మలకు ఏకంగా 31.19 లక్షల ఇళ్ల స్థలాలు ఇవ్వగలిగామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఇంటి స్థలం, ఇల్లు రూపంలో ప్రతి నిరుపేద అక్కచెల్లెమ్మకు రూ.20 లక్షల వరకు విలువైన ఆస్తిని ఇవ్వగలిగే గొప్ప అవకాశాన్ని దేవుడు తనకు ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద 4,07,323 మంది లబ్ధిదారులకు బ్యాంకు రుణాలపై వడ్డీని రీయింబర్స్ చేస్తూ రూ.46.90 కోట్ల మొత్తాన్ని సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులను ఉద్దేశించి సీఎం జగన్ మాట్లాడారు. ''రాష్ట్రంలో ఇప్పటికే 22.25 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. రాష్ట్ర చరిత్రలో ఇది ఎక్కడా, ఎప్పుడూ చూడని విధంగా చేపడుతున్నాం. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.2.70 లక్షలు ఖర్చవుతుంది. మరో రూ.లక్ష మౌలిక సదుపాయాల కోసం అదనంగా ఖర్చవుతుంది. ఇంటి నిర్మాణం, మౌలిక వసతుల కోసం దాదాపు రూ.3.70 లక్షలు ఖర్చు అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో రూ.1.80 లక్షలు నేరుగా అక్కచెల్లెమ్మలకు ఇస్తున్నాం. మరో రూ.35 వేలు పావలా వడ్డీకి రుణాలను అందుబాటులోకి తెచ్చాం. దాదాపు రూ.15 వేలు ఖరీదు చేసే ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తున్నాం. సిమెంట్, మెటల్ ఫ్రేమ్స్ లాంటి వివిధ రకాల నాణ్యమైన వస్తువులను మార్కెట్ ధర కన్నా తక్కువకు సబ్సిడీపై అందించడం ద్వారా రూ.40 వేల దాకా ప్రయోజనం చేకూరుస్తున్నాం. మనం ఇచ్చిన ఇంటి స్థలం మార్కెట్ విలువ ప్రాంతాన్ని బట్టి కొన్ని జిల్లాల్లో రూ.15 లక్షల పైచిలుకు ఉంది. ఈ విలువ మీద ఇళ్లు, మౌలిక సదుపాయాల విలువలను కలిపితే ప్రతి అక్కచెల్లెమ్మకు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ ఆస్తిని తోబుట్టువుగా సమకూరుస్తున్నాం'' అని చెప్పారు.

సిరిసిల్లలో సాంచాల బంద్ ఉపసంహరణ

- మొదలైన వస్త్రోత్పత్తి

సిరిసిల్ల: సిరిసిల్లలో రెండురోజులుగా బంద్ పడిన మరమగ్గాలు మళ్లీ వస్త్రోత్పత్తిని ప్రారంభించాయి. స్థానిక పాలిస్టర్ అసోసియేషన్ భవన్‌లో గురువారం సమావేశమైన వస్త్రోత్పత్తిదారులు ఆసాములు, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వస్త్రపరిశ్రమ బంద్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మండల సత్యం, కార్యదర్శి వెల్దండి దేవదాస్, ఉపాధ్యక్షుడు బూట్ల నవీన్ తెలిపారు. సిరిసిల్లలో సాంచాల బంద్ కారణంగా వస్త్రోత్పత్తి నిలిచిపోవడంతో కార్ఖానాల్లోని కార్మికులకు ఉపాధి కరువైంది. ప్రభుత్వ పెద్దలు సైతం పరిశ్రమను బంద్ చేయొద్దని చెప్పడం, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వస్త్రోత్పత్తిని తిరిగి ప్రారంభిస్తున్నా మని వారు వెల్లడించారు. బంద్ ఉపసంహరణ తో గురువారం సాయంత్రమే ఆసాములు వస్త్రోత్పత్తిని ప్రారంభించారు.

జిల్లా వార్తలు

కోల్ ప్లాంట్‌లో మంటల అదుపునకు చర్యలు



కోల్ యార్డ్‌ను పరిశీలిస్తున్న సీఈ ప్రభాకర్‌రావు

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల కోల్ ప్లాంట్‌లో మంటల వల్ల నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్ రావు ఆదేశించారు. నిల్వ ఉన్న బొగ్గుకు అడపదడపా మంటలు అంటుకుని కాలుతున్న విషయమై ఈనెల 15వ తేదీన 'బూడిదవుతున్న బొగ్గు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన సీఈ గురువారం కోల్ ప్లాంట్‌ను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. మంటలు రాకుండా నీళ్లు చల్లించాలని, కర్మాగారానికి ముందు వచ్చే బొగ్గు రేక్‌లను ముందుగానే వాడాలని, బొగ్గు నిల్వల్లో ఎయిర్ పాకెట్స్ రాకుండా డోజర్లతో తొక్కించాలని సూచించారు. ఎక్కడైనా మంటలు కనిపిస్తే ఆ మేరకు బొగ్గు బయటకు తీసి వాడేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోల్ ప్లాంట్ ఎస్ఈ పి.కృష్ణ, డీఈలు మధుబాబు, సునీల్, మంజా, ఏడీఈలు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులకు షోకాజ్ నోటీసులు?

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మూడు మండలాల రెవెన్యూ అధికారులకు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం... జిల్లాలోని ఆయా మండలాల్లో అనుమతి లేకుండా జరుగుతున్న భవన నిర్మాణాలపై ఐటీడీఏ పీఓ ఇటీవల ప్రత్యేక దృష్టి సారించారు. అలాంటి భవన నిర్మాణాలను గుర్తించి ఎల్టీఆర్ చట్టం కింద నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అయితే, దమ్ముపేట, పినపాక, గుండాల మండలాల అధికారులు చట్టాలను సరిగ్గా అమలు చేయలేదని పీఓకు సమాచారం అందింది. దీంతో దమ్ముపేట డిప్యూటీ తహసీల్దార్, పినపాక, గుండాల మండలాల తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసిన పీఓ.. మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది.

కుర్చీలకు అతుక్కుపోయారు..!

- ప్రధాన కార్యాలయం, సింగరేణి భవన్‌లో ఏళ్ల తరబడి విధులు
- అధిక హెచ్‌ఆర్‌ఏ కోసం హైదరాబాద్‌ను వీడని ఉద్యోగులు
- ఎంవీటీసీలో శిక్షణ పూర్తికాగానే నేరుగా పోస్టింగ్‌లు
- రిటైర్డ్ ఉద్యోగులకు, ఉన్నతాధికారుల పరిచయస్తులకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు
- సింగరేణి స్టాండింగ్ ఆర్డర్లను తుంగలో తొక్కుతున్న ఉన్నతాధికారులు



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో కొందరు అధికారులు, ఉద్యోగులు కుర్చీలకు అతుక్కుపోతున్నారు. ఏళ్లు గడుస్తున్నా మరోచోటకు బదిలీ కాకుండా పైరవీలతో తిష్టవేస్తున్నారు. సంస్థకు ఆయువు పట్టుగా ఉన్న కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయాన్ని, హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను పట్టుకుని వేలాడుతున్నారు. సంస్థ సర్క్యులర్లు, స్టాండింగ్ ఆర్డర్లకు విరుద్ధంగా కొనసాగుతున్నారు. సింగరేణి సంస్థ నిబంధనల ప్రకారం అధికారులను మూడేళ్లకోసారి బదిలీ చేయాలి. ఎన్‌సీడబ్ల్యూఏ పరిధిలోకి వచ్చే కార్మికులు, క్లర్క్‌లకు ఐదారేళ్లకోసారి స్థానచలనం కల్పించాలి. కానీ ఈ నిబంధనలు సింగరేణి ప్రధాన కార్యాలయంతోపాటు సింగరేణి భవన్‌లో మాత్రం అమలు కావటం లేదు. భూగర్భ గనుల్లో విధులు నిర్వర్తించే కార్మికులను ఉపరితల గనులకు పంపాలంటే ని'బంధనాలు' విధిస్తున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి.

10 ఏళ్లుగా సింగరేణి భవన్‌లోనే..

హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో కొందరు పదేళ్లుగా విధులు నిర్వర్తించడం విమర్శలకు తావిస్తోంది. వారు అక్కడే సర్వీసు పూర్తి చేసుకుని ఉద్యోగ విరమణ పొందుతారా? అనే పరిస్థితి కార్మికవర్గంలో నెలకొంది. ఎన్‌సీడబ్ల్యూఏ పరిధిలోని ఉద్యోగులు కొందరు ఉద్యోగం వచ్చాక 20 నుంచి 25 ఏళ్లపాటు ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అపాయింట్‌మెంట్ నుంచి రిటైర్మెంట్ వరకు ప్రధాన కార్యాలయం, సింగరేణి భవన్‌లను వీడటంలేదని కార్మికులు పేర్కొంటున్నారు. అధిక హెచ్‌ఆర్‌ఏ వస్తుండటంతో హైదరాబాద్‌ను వదిలి రావడంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఔట్ సోర్సింగ్ పోస్టుల్లో అక్రమాలు!

సంస్థలో ఉద్యోగులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాల్సి ఉండగా, రిక్రూట్‌మెంట్ సెల్ అధికారులు సింగరేణి లేదా ఇతర సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందినవారికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారుల పరిచయస్తులకు కూడా ఉద్యోగాలు కట్టబెడుతున్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు లాభాల వాటా చెల్లించినట్లు కార్మికులు పేర్కొంటున్నారు. అయితే ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ లాభాల వాటా చెల్లించాలని, అంతేకాని ఉన్నతాధికారులతో పరిచయం ఉన్నవారికి మాత్రమే ఎలా చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు. పీహెచ్‌డీ, పోస్టు గ్రాడ్యుయేషన్, అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నిరుద్యోగులు ఉండగా, ఉద్యోగ విరమణ పొందినవారిని నియమించడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు, యూనియన్లు కూడా నోరు మెదపడంలేదు.


టెండర్లు లేకుండా కన్వీయెన్స్ వాహనాలు

సింగరేణిలో టెండర్ల ద్వారా అధికారులకు కన్వీయెన్స్ వాహనాలు ఏర్పాటు చేస్తారు. సింగరేణి భూ నిర్వాసితులకు, డిపెండెంట్ ఉద్యోగాలు పొందలేకపోయినవారికి వాహనాల ఏర్పాటులో ప్రాధాన్యమివ్వాలన్ని సంస్థ పదేళ్లుగా పేర్కొంటోంది. కానీ సింగరేణి భవన్‌లో మాత్రం టెండర్లు లేకుండానే వాహనాలను ఏర్పాటు చేస్తున్నారని, నిర్వాసితులకు, డిపెండెంట్లకు ప్రాధాన్యమివ్వడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

బదిలీ వర్కర్లకు నేరుగా పోస్టింగ్‌లు

సింగరేణి సంస్థ స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం కొత్తగా నియమితులైన కార్మికులను బదిలీ వర్కర్లుగా పేర్కొంటారు. ఉద్యోగ పొందాక ప్రతీ ఒక్కరు మైన్స్ ఒకేషనల్ ట్రెనింగ్ సెంటర్(ఎంవీటీసీ)లో శిక్షణ తీసుకోవాలి. నిర్దేశిత మస్టర్లు పూర్తిచేస్తే పర్మనెంట్ గ్రేడ్ ఇస్తారు. విధుల్లో చేరినప్పటి నుంచి ఐదేళ్లపాటు అండర్ గ్రౌండ్‌లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అనంతరం ఖాళీలను బట్టి ఉపరితల గనులకు బదిలీ చేస్తారు. అయితే కొందరు ఉన్నతాధికారులు నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. శిక్షణ పూర్తయ్యాక ఆరుమాసాలకే ఇతర ప్రాంతాల్లోని ఉపరితల గనులకు బదిలీ చేస్తున్నారు. ఇటీవల శిక్షణ పూర్తికాగానే కొందరికి హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అనారోగ్యం బాధపడుతున్న కార్మికులను కూడా సర్ఫేస్‌కు పంపని యాజమాన్యం, వీరికి ఎలా పోస్టింగ్ ఇచ్చిందని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. కొందరు పరపతి, పలుకుబడితో స్టాండింగ్ ఆర్డర్స్ పాటించడంలేదని ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



సింగరేణి సంస్థకు కొన్ని నిబంధనలు ఉన్నాయి. వాటిని ఎవరు డీమోరల్ చేసినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. రిక్రూట్‌మెంట్, ఇతర విషయాల్లోనైనా అందరూ సమానమే. లాంగ్ స్టాండింగ్ ఉద్యోగుల వివరాలు ఆరా తీసి ప్రక్షాళన చేస్తాం.

–ఎస్.బలరామ్, సింగరేణి సీఎండీ

తమ్మినేనికి మంత్రి పొంగులేటి పరామర్శ

ఖమ్మంవన్‌టౌన్: హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను గురువారం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఆస్పత్రిలో ఆయనకు అందుతున్న చికిత్సపై వైద్యులతో మాట్లాడిన మంత్రి.. మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. మంత్రి వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు తదితరులు ఉన్నారు.



వీరభద్రంను పరామర్శిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

ఎన్నికల ముందు బీజేపీ శ్రీరామ జపం

- ప్రశ్నించడంలో బీఆర్‌ఎస్‌ది తొందరపాటుతనం
- ప్రజాసమస్యల పరిష్కారమే అజెండాగా సీపీఐ కార్యాచరణ
- పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని




సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

ఖమ్మంమయూరిసెంటర్: పదేళ్ల పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బీజేపీ ఎన్నికల ముందు శ్రీరామజపం చేస్తోందని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. గడిచిన పదిహేను రోజులుగా రామ జపం చేస్తూ ప్రజలను మోసపుచ్చేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తున్నా దేశ ప్రజలు మరోమారు అవకాశం ఇవ్వబోరని స్పష్టం చేశారు. సీపీఐ ఖమ్మం జిల్లా సమితి సమావేశం గురువారం గిరిప్రసాద్ భవన్‌లో శింగు నర్సింహారావు అధ్యక్షతన జరగగా కూనంనేని మాట్లాడారు. దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు సంబంధించి ఏ ఒక్క సానుకూల నిర్ణయం తీసుకోని బీజేపీ మతాన్ని ఎరగా చూపి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. హిందూమత పీఠాధిపతులు రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనపై భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చినా ఎన్నికల నోటిఫికేషన్‌ను దృష్టిలో ఉంచుకొని బీజేపీ తొందరపడుతోందని పేర్కొన్నారు. ఇక బీజేపీ తర్వాత అతి పెద్ద పార్టీగా, ప్రత్యామ్నాయ శక్తిగా ఉన్న కాంగ్రెస్ కలుపుకెళ్లే ధోరణితో వ్యవహరించకపోతే మరోసారి నష్టం జరుగుతుందని తెలిపారు. మూడు రాష్ట్రాల్లో బీజేపీపై వ్యతిరేకత ఉన్నా వ్యతిరేక భావజాలం కలిగిన పార్టీలను ఐక్యం చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని చెప్పారు. ఇక రాజస్థాన్‌లో సీపీఎంకు రెండు స్థానాలున్నా కలుపుకుపోలేదని, ఛత్తీస్‌గఢ్‌లో సీపీఐతో పొత్తు లేకపోవడం వల్ల కాంగ్రెస్ 15 స్థానాల్లో ఓటమి చవిచూసిందని పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలో ఓడిపోయిన బీఆర్ఎస్ తొందరపడుతోందని కూనంనేని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు ఓట్లు వేయగా.. హామీల అమలుకు కనీస సమయం ఇవ్వకుండా విమర్శించడం సరైన రాజకీయ వైఖరి కాదన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలు ఎన్నో ఆశలతో అధికారాన్ని అప్పగించినందున అందుకనుగుణంగా ఆ పార్టీ వ్యవహరించాలని కోరారు. ఇక సీపీఐ విస్తరణ, బలోపేతం, ప్రజాసమస్యలపై పోరాటమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు ఆయన సూచించారు. స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లోపార్టీ నిర్ణయాలకనుగుణంగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

21న భారత జాతీయ ప్రకృతి ఆరోగ్య సమ్మేళనం

- దేశవాళీ బియ్యం, కూరగాయల విత్తనాల ప్రదర్శన
- వివరాలు వెల్లడించిన డాక్టర్ రామచంద్రరావు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామచంద్రరావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రకృతి వైద్యసేవలందిస్తున్న సిద్ధార్థ యోగా విద్యాలయం స్థాపించి 24 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 21న నేలకొండపల్లిలోని విద్యాలయంలో భారత జాతీయ ప్రకృతి ఆరోగ్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ రామచంద్రరావు తెలిపారు. ఖమ్మంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1999 నుంచి ప్రజా ఆరోగ్య రంగంలో సిద్ధార్థ యోగా విద్యాలయం కృషి చేస్తోందని చెప్పారు. జిల్లా, రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల ప్రజలు సైతం వచ్చి ప్రకృతి వైద్యం తీసుకుంటున్నారని తెలిపారు. ఈమేరకు 21న నిర్వహించే జాతీయ సమ్మేళనానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలతో పాటు ఆస్ట్రేలియా, కెనడా దేశాల నుంచి ప్రతినిధులు రానున్నారని వెల్లడించారు. సమ్మేళనంలో వంద రకాల దేశవాళీ బియ్యం, వంద రకాల దేశవాళీ కూరగాయల విత్తనాలు ప్రదర్శిస్తామని, మగ్గం నేత, మట్టి కుండల తయారీ, భారత పురాతన మల్కం గేమ్ ప్రదర్శన, బాలబాలికలచే సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ప్రకృతి ప్రేమికులు, ఆరోగ్యాభిలాషులు అందరూ పాల్గొని సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని రామచంద్రరావు కోరారు. ఈ సమావేశంలో అప్పారావు, ప్రసాద్, లక్ష్మణ్‌రావు, కోదండరామ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.